క్లుప్తంగా

67వ రోజుకు చేరుకున్న సూపర్‌మ్యాక్స్ కార్మికుల దీక్ష



67వరోజు దీక్షలో కూర్చున్న సూపర్‌మ్యాక్స్ కార్మికులు

జీడిమెట్ల: సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ కార్మికులు నిరాహార దీక్ష చేపట్టి గురువారంతో 67రోజులు అయ్యింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. న్యాయం జరిగే వరకు దీక్ష విరమించబోమని అన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తమ గోడు పట్టించుకుని త్వరగా న్యాయం జరిగేలా చూడాలని కోరారు. తమకు న్యాయం చేసిన వారికి రుణపడి ఉంటామన్నారు.

జనావాసాల్లోకి రక్తపింజర



గ్రీన్‌హిల్స్ కాలనీలోని ఓ ఇంట్లోకి ప్రవేశించిన రక్తపింజర

సుభాష్‌నగర్: అరణ్యంలో ఉండాల్సిన రక్తపింజర (పాము) జనవాసాల్లోకి రావడంతో స్థానికులు బెంబేలెత్తారు. దుండిగల్ మున్సిపల్ బహదూర్‌పల్లిలోని గ్రీన్ హిల్స్ కాలనీ రోడ్‌నం.10లో మధు అనే వ్యక్తి ఇంట్లోకి గురువారం సాయంత్రం భారీ రక్తపింజర వచ్చి చేరింది. స్థానికులు గమనించి బౌరంపేటలోని స్నేక్ రెస్క్యూ సెంటర్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో స్నేక్ రెస్క్యూ టీమ్ సభ్యులు గురువారం ఉదయం గ్రీన్‌హిల్స్ కాలనీకి చేరుకుని రక్తపింజరను బంధించి బౌరంపేటకు తరలించారు. రక్తపింజర 10 కిలోల బరువు ఉంటుందని తెలిపారు.

నాలా వ్యర్థాల తొలగింపు



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ

సుభాష్‌నగర్: ప్రజలకు ఇబ్బంది కలుగకుండా నాలాలను శుభ్రం చేసేందుకు కృషి చేస్తున్నామని సూరారం డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ అన్నారు. షాపూర్ నగర్ రైతు బజారు సమీపంలో ఉన్న నాలాలో వ్యర్థాలు పేరుకుపోవడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఈ విషయమై కార్పొరేటర్‌కు ఫిర్యాదులు రావడంతో గురువారం పారిశుద్ధ్య కార్మికులను పిలిపించి నాలాను శుభ్రం చేయించారు. ఆయన వెంట జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఇర్ఫాన్, బీఆర్ఎస్ నాయకుడు సదానందగౌడ్ తదితరులు ఉన్నారు.

అపూర్వ సమ్మేళనం



రంగారెడ్డినగర్: విద్యార్థులు ఉన్నతులుగా రాణించినప్పుడే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యతలకు సార్థకత చేకూరుతుందని గాయత్రి గ్రామర్ హైస్కూల్ చైర్మన్, కరెస్పాండెంట్ అలివేలు అన్నారు. (1997–98) బ్యాచ్ 10వ తరగతి విద్యార్థుల అపూర్వ సమ్మేళనం గురువారం షాపూర్‌నగర్‌లోని శుభం కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై అలివేలు మాట్లాడుతూ.. తమ పాఠశాలలో విద్యనభ్యసించిన ఎంతోమంది విద్యార్థులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు సాఫ్ట్‌వేర్ రంగాలలో విధులు నిర్వర్తిస్తూ ఉన్నత స్థాయిలో స్థిరపడడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. అనంతరం ఉపాధ్యాయులు,విద్యార్థులు పాత జ్ఞాపకాలను నెమరవేసుకుని ఆత్మీయంగా పలకరించుకుంటూ సందడిగా గడిపారు. 25ఏళ్ల తర్వాత తమ బ్యాచ్ ఈ విధంగా కలుసుకోవడం మధురానుభూతిగా ఉందని విద్యార్థులు సంతోషం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు వేడుకల ఆర్గనైజింగ్ కోర్ టీమ్ సభ్యులు నాగరాజు, మోయిన్, సుష్మ, స్వప్న, శ్రీధర్, శ్రీకాంత్, సంతోష్, తిరుపతి పాల్గొన్నారు.

ఇక్రిశాట్ కార్మికులకు అండగా ఉంటాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఇక్రిశాట్‌లో పనిచే సే కార్మికులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నియోజవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం పట్టణంలో ఇక్రిశాట్ గేట్ వద్ద కార్మికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్రిశాట్‌లో పని చేసే కార్మికులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించగా కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేవిధంగా కృషి చేస్తానని శ్రీనివాస్‌గౌడ్ హామీ ఇచ్చారు.

హెచ్ఎంటీ.. డంపింగ్ కేంద్రమా ఏంటి?



జీహెచ్ఎంసీ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

చింతల్: వందలాది ఎకరాల విస్తరించి ఉన్న హెచ్ఎంటీ పరిశ్రమ ఖాళీ స్థలం అక్రమ డంపింగ్‌లకు అడ్డగా తయారైంది. పరిశ్రమ ఖాళీ స్థలం చుట్టూ అనేక బస్తీలు వెలవగా గతంలో హెచ్ఎంటీ అధికారులు కొన్ని ప్రాంతాల్లో అక్రమణలను తొలగించి మరికొన్ని ప్రాంతాల్లో గోడలను నిర్మించారు. మరి కొన్ని ప్రాంతాల్లో కందకాలు గోడలు ఏర్పాటు చేయని ఖాళీస్థలాలు అక్రమ డంపింగ్‌లకు కేంద్రాలుగా మారాయి.

◆ డివిజన్‌లోని చింతల్ బస్టాప్ నుంచి భగత్‌సింగ్‌నగర్‌కు వచ్చే దారిలో కొంతమేర హెచ్ఎంటీ అధికారులు కందకం తీయకుండా గోడల నిర్మించకుండా అలాగే వదిలేశారు. దీని పక్కనే శ్మశానవాటిక ఉండటంతో ఇటువైపు కొంత మేర ఖాళీ ప్రదేశంగా ఉంటుంది. కొంతమంది అక్రమార్కులు కూల్చివేసిన ఇళ్ల వ్యర్థాలను తీసుకువచ్చి ఇక్కడ పారబోస్తున్నారు.

◆ ఇక్కడ వ్యర్థాలను పారబోద్దంటూ జీహెచ్ఎంసీ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా అవేవీ తమకు పట్టనట్టుగా పలువురు అక్రమణదారులు ఇళ్ల వ్యర్థాలను ట్రాక్టర్లలో తీసుకువచ్చి డంప్ చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు.

◆ ఇక్కడి నుంచి హెచ్ఎంటీ కాలనీలోని ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న బాటల్లో కొంతమంది గంజాయి అలవాటు పడ్డ యువకులు అడ్డాగా మార్చుకున్నారు. ఇక్కడ జనసంచారం లేక పోవడం కారణంగా రోడ్డు నుంచి బస్టాప్ వెళ్లే వారికి.. అటు నుంచి ఇటు వచ్చే వారికి ఈ గంజాయికి అలవాటు పడ్డ యువకులు పెద్ద ఆటంకిగా మారారు.

◆ లక్ష్మీనగర్ నుంచి హెచ్ఎంటీ బస్టాండ్ కు



హెచ్ఎంటీ ఖాళీ ప్రదేశంలో డంప్ చేస్తున్న ఇళ్ల వ్యర్థాలు

వెళ్లే వారిని రాత్రి వేళల్లో వెనుక నుంచి తరుముతూ భయభ్రాంతులకు గురి చేస్తూ వారి వద్ద ఉన్న నగలు, సొమ్మును తస్కరించి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు.

◆ జీహెచ్ఎంసీ అధికారులు చొరవ తీసుకొని భగత్‌సింగ్‌నగర్‌లోని చింతల్ శ్మశానవాటిక నుంచి హెచ్ఎంటీకాలనీ వరకు ఉన్న ఖాళీ ప్రదేశంలో గోడలను నిర్మించినట్లయితే ఆకతాయిలకు అడ్డుకట్ట పడటంతో పాటు అక్రమంగా డంపింగ్ చేసే వారు సైతం ఎక్కడ డంపు చేయకుండా ఉంటారని స్థానికులు పేర్కొంటున్నారు.

నూతన విద్యావిధానంలో నాణ్యమైన విద్య

సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిటైర్డ్ ప్రొఫెసర్ రుమేష్‌చందర్

రాయదుర్గం: నూతన విద్యావిధానం ద్వారా భారత విద్యారంగంలో అనేక మార్పులు వస్తాయని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఢిల్లీ రిటైర్డ్ ప్రొఫెసర్ రుమేష్‌చందర్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మనూ విశ్వవిద్యాలయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో 'విద్యపై ఆర్థిక నిర్ణయాల ప్రభావం: కొత్త విద్యా విధానం-2020లో ప్రతిబింబాలు' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విద్యను అందించడానికి, పోటీ జాబ్ మార్కెట్‌లో విజయం సాధించడానికి అవసరమైన నైపుణ్యాలతో విద్యార్థులను సన్నద్ధం చేయడానికి నూతన విద్యావిధానంలో తీసుకున్న కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ డీన్ ప్రొఫెసర్ సిద్ధిఖీ మహ్మద్ మహమూద్, విద్యావిభాగాధిపతి ప్రొఫెసర్ మహ్మద్ మోషా హిద్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అశ్విని ప్రసంగించారు. కార్యక్రమంలో ఉర్దూ విశ్వవిద్యాలయం వివిధ విభాగాల విద్యార్థులు, ఇతర విశ్వవిద్యాలయాల అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ జాంకు శాశ్వత పరిష్కారం చూపుతాం

మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: జాతీయ రహదారిపై ఇటీవల కురిసిన వర్షాల వల్ల గుంతలు పడిన రోడ్లు, రాకపోకలకు ఇబ్బందులు కల్గుతున్న ప్రాంతాలను గురువారం మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, అల్వాల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజు, ప్రాజెక్టు మేనేజర్ స్వామి, సైట్ ఇన్‌చార్జ్‌లు విజయ్, మనోజ్ పరిశీలించారు.

◆ బోయినపల్లి చెక్‌పోస్ట్ నుంచి కొంపల్లి ఫ్లైఓవర్ వరకు ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. ట్రాఫిక్, నేషనల్ హైవే అథారిటీ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో సుమారు 10 కిలోమీటర్ల మేర వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టేందుకు ముందుకొచ్చారు.

◆ ముఖ్యంగా కొంపల్లి ఫ్లైఓవర్ వద్ద ఎగువ భాగం



జాతీయ రహదారిపై గోతులను పరిశీలిస్తున్న అధికారులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాసరావు

నుంచి వచ్చే వర్షపునీరు మొత్తం ప్రధాన రహదారి చంద్రారెడ్డి గార్డెన్, అపర్ణకాలనీ వద్ద తీవ్ర ట్రాఫిక్ జామ్ అవుతోందని గుర్తించామని తెలిపారు. దీనికి శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకుంటామని నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి జయంత్యుత్సవం



లక్ష పుష్పార్చన పూజలో పాల్గొన్న భక్తులు

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ జీడిమెట్ల బస్‌డిపో సమీపంలోని నల్లగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం స్వామివారి జయంత్యుత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు అభిషేకం,అర్చన, లక్ష పుష్పార్చన నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ తీర్థ ప్రసాదాలను అందజేశారు. శుక్రవారం స్వామివారి కల్యాణం,అన్నదానం, స్వామివారి ఊరేగింపు ఉంటుందని ఆలయ కమిటీ పేర్కొంది. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు కూన శ్రీనివాస్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు ఇంద్రసేన గుప్తా, శ్రీరాములు,గోమారం రాజిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, యాదగిరి, సంజురెడ్డి, టీవీ సీను, సాగర్, నాగిళ్ల శ్రీనివాస్, నరసింహారెడ్డి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

వివాద స్థలాన్ని పరిశీలించిన అధికారులు

కుత్బుల్లాపూర్: గాజులరామారం డివిజన్ కైలాస్ హిల్స్, షిరిడీహిల్స్ మధ్య వివాదాస్పదంగా ఉన్న స్థలాన్ని గురువారం విజిలెన్స్ డీఈ విజయ్‌కుమార్ రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. స్థానికంగా పరికి చెరువును అనుకుని ఉన్న 299, 300, 301, 295, 298 సర్వే నంబర్లలోని స్థలానికి సంబంధించి కైలాస్ హిల్స్ కాలనీవాసుల, మరో ఇద్దరి వ్యక్తుల మధ్య కొన్ని రోజులుగా వివాదం నడుస్తోంది. సర్వే నం .295లోని 4198 గజాల పార్కు స్థలాన్ని ఓ వ్యక్తి మరో సర్వే నంబరు పేరుతో కబ్జా చేస్తున్నారని తెలిపారు. మరోపక్క వేరే వ్యక్తి ఎఫ్‌టీఎల్ స్థలంలో నిర్మాణాలు చేపడుతూ కాలనీ వారికి సంబంధించిన ప్లాట్లు, రోడ్డును తన స్థలంలోకి కలుపుకొని నిర్మాణాలు చేపడుతున్నారని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై ఏప్రిల్ 28న అధికారుల తీరుపై కాలనీవాసులు ఏకమై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో విజిలెన్స్ అధికారులు ఇతర శాఖ అధికారులతో కలిసి పర్యటించారు. ఎఫ్‌టీఎల్ స్థలం, పార్కు, కాలనీవారి ప్లాట్లను, వాటి సరిహద్దులను స్థానిక సర్వేయర్ సునీతతో అడిగి తెలుసుకున్నారు. అధికారుల వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ విశ్వం, టౌన్‌ప్లానింగ్ అధికారి నరేష్ ఉన్నారు.



మ్యాప్ ద్వారా ఆక్రమణకు గురవుతున్నా స్థలాన్ని పరిశీలిస్తున్న విజిలెన్స్ డీఈ విజయ్‌కుమార్

సర్వీసు రోడ్డులో కూరుకుపోయిన బస్సు

కుత్బుల్లాపూర్: ఓ ట్రావెల్స్ బస్సు సర్వీసు రోడ్డు నుంచి జాతీయ రహదారిపైకి వచ్చే క్రమంలో గుంతలో ఇరుక్కుపోయింది. దీంతో అటువైపుగా వెళ్లే వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. పేట్ బషీరాబాద్ సమీపంలోని సర్వీస్ రోడ్డు మీదుగా వెళ్లాల్సిన బస్సు ఆటోలు, ద్విచక్ర వాహనాలు వెళ్లే ఇరుకైన సందు నుంచి రోడ్డుమీదికి వెళ్లే ప్రయత్నం చేశాడు. ఇక అంతే ముందు భాగం వెళ్లింది. వెనక భాగం ఇరుక్కుపోయింది. కొంపల్లి నుంచి సుచిత్రకు వెళ్లే వాహనాలు ఈ రహదారిపైనే నగరానికి చేరుకుంటాయి. రోడ్డుకు అడ్డంగా బస్సు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకొని డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.



బస్సు కూరుకుపోవడంతో నిలిచిపోయిన వాహనాలు

ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడి అదృశ్యం

దుండిగల్: ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడు అదృశ్యమైన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం కాలనీకి చెందిన శివకుమార్, నాగమణి దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్యభర్తలు ప్రైవేటు ఉద్యోగులు చేస్తున్నారు. కాగా నాగమణి గురువారం ఉదయం తన ఇద్దరు కుమారులను సాయిబాబానగర్, నర్సింహ బస్తీలోని తన తల్లి గారింట్లో వదిలేసి పనికి వెళ్లింది. చిన్న కుమారుడు మణితేజ(04) గురువారం ఉదయం ఇంటి ముందు ఆడుకుంటూ కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు బాలుడి కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. బాలుడి మామ నర్సింగ్‌రావు ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మణితేజ (ఫైల్)

సమస్యల పరిష్కారమే కమ్యూనిస్ట్ పార్టీల అజెండా

చింతల్: ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా కమ్యూనిస్ట్ పార్టీలు పని చేస్తున్నాయని సీపీఐ శాఖ కార్యదర్శులు సాయిలు, నరేంద్రచారి అన్నారు. గురువారం గాజులరామారం సర్కిల్ పరిధిలోని శ్రీరామ్‌నగర్, వల్లభాయ్ పటేల్‌నగర్, రోడామేస్త్రీనగర్‌లలో సీపీఐ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితుల్లో రాజకీయ పార్టీలు డబ్బులు పంచి గెలవాలని చూస్తున్నాయని అన్నారు. నిజాయితీగా గెలవాలని ప్రయత్నించడం లేదన్నారు. అలాంటి నాయకులకు ఈ దఫా ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. ప్రజల్లో ఉంటూ పోరాటాలు సాగించే వామపక్షాలకు మద్దతు తెలపాలని వారు కోరారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి రాము, కార్యవర్గ సభ్యులు హరినాథ్, శ్రీనివాస్, శ్రీకాంత్, ప్రశాంత్, అభిషేక్, కొండన్న, సామెల్, శ్రీనివాస్‌రావు, వెంకటేశ్వర్లు, నారాయణ, శోభన్, రాజశేఖర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన శంభీపూర్ రాజు



మంత్రి కేటీఆర్‌తో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: భారత దేశ రాజధాని ఢిల్లీలో గురువారం బీఆర్ఎస్ పార్టీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించిన కార్యక్రమంలో నగరానికి చెందిన పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు. మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు హాజరయ్యారు.

ఫ్రాన్స్‌లో భారత విద్యార్థులకు మంచి అవకాశాలు

సీఎఫ్ఐ ప్రతినిధి మిర్రిన్ రైఖాన్

రాయదుర్గం: భారతదేశ విద్యార్థులకు ఫ్రాన్స్‌లో ఉన్నత విద్యావకాశాలు ఉన్నాయని క్యాంపస్ ఫ్రాన్స్ ఇండియా (సీఎఫ్ఐ) ప్రతినిధి మిర్రిన్‌రైఖాన్ స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో సీపీడీయూఎంటీ ఆడిటోరియంలో ఉర్దూ విశ్వవిద్యాలయం, క్యాంపస్ ఫ్రాన్స్ ఇండియా సంయుక్తంగా 'ఫ్రాన్స్‌లో ఉన్నత విద్యావకాశాలు' అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత్‌లోని విద్యార్థులకు ఫ్రాన్స్‌లో విస్తృతమైన అధ్యయన ఎంపికలను అందించే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. విద్యావ్యవస్థ, ప్రవేశ అవసరాలు, అందుబాటులో ఉన్న కోర్సుల గురించి విలువైన సమాచారాన్ని విద్యార్థులకు అందించారు.

ఇంటింటికీ 'కమలం పువ్వు'

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్‌లో 'మరోసారి మోదీ సర్కార్ – తెలంగాణలో ఈసారి బీజేపీ ప్రభుత్వం'అనే నినాదంతో గురువారం ఇంటింటికీ 'కమలం పువ్వు'కార్యక్రమం చేపట్టారు. కమలం పువ్వు గోడ చిత్రాన్ని బీజేపీ నాయకుడు, కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు సమష్టిగా పని చేసి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సాయినాథ్ నేత, కృష్ణ యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, రాజిరెడ్డి, నవీన్, మంగమ్మ, బాలకృష్ణ, శేఖర్, శంకర్ సింగ్, హరి, రంజిత్ సింగ్, క్రాంతి యాదవ్ పాల్గొన్నారు.



కైసర్‌నగర్‌లో గోడపై కమలం గుర్తును ఆవిష్కరించిన బీజేపీ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్

ఆలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి 11వ డివిజన్‌లోని శ్రీనల్లపోచమ్మ ఆలయ పునః ప్రతిష్ఠ మహోత్సవంలో గురువారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేదపండితుల మంత్రోచ్ఛరనల మధ్య చతుస్థానార్చనలు, మూలమంత్ర హోమం, ధ్యాన్య దివాసం, బలిహారణలు నిర్వహించగా బీఆర్ఎస్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, కొలన్ గోపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలన్నారు. వాటి అభివృద్ధికి తమ సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆగం పాండు ముదిరాజ్, రాజేశ్వరి, ఆవుల పావని, నాయకులు జగన్ యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు నర్సింహాచారి, కొలన్ మహేందర్‌రెడ్డి, ఎల్లయ్య, జగన్ యాదవ్, నర్సింగ్, యాదయ్య చారి, మహేష్, రమేష్, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న బీఆర్ఎస్ నేత కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నాం

దుండిగల్: దశలవారీగా మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. మున్సిపాలిటీ పరిధి శంభీపూర్‌లో భ్రమరాంబ మల్లికార్జున ఫంక్షన్‌హాల్ ఆవరణలో రూ.30 లక్షల వ్యయంతో నూతనంగా చేపట్టనున్న ప్రహరీ, వంట గది, మరుగు దొడ్లు తదితర నిర్మాణ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. త్వరలోనే పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, సాయియాదవ్, నేతలు అర్కల జీతయ్య, సత్తయ్య, ఆంజనేయులు, పెంటయ్య, యాదయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కమిషనర్ సత్యనారాయణ, కౌన్సిలర్లు

మద్యం మత్తులో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్‌జిల్లా శివంపేట్ మండలం, గోమారం గ్రామానికి చెందిన కుంటి శ్రీకాంత్ (32) రెండు నెలల క్రితం తన భార్య రజిత, ఇద్దరుకు మార్తెలతో కలిసి జీడిమెట్ల భాగ్యలక్ష్మి కాలనీలోని ఓ గదిని అద్దెకు తీసుకుని కరెంట్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా రెండు రోజుల క్రితం భార్య రజిత తన పిల్లలను తీసుకుని ఓ శుభకార్యానికి హాజరయ్యేందుకు గోమారం వెళ్లింది. ఇంట్లో ఒక్కడే ఉన్న శ్రీకాంత్ మద్యం సేవించి తాగిన మత్తులో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం ఉదయం 11గంటలకు ఈ విషయాన్ని గమనించిన ఇంటి యజమాని శారద ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీకాంత్ (ఫైల్)

దేవాలయాల జోలికి వస్తే ఊరుకునేది లేదు

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: ఆలయాల జోలికి వస్తే ఊరుకునేది లేదని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎన్‌సీఎల్ నార్త్ ఎవెన్యూ కాలనీలోని సాయి బాబా ఆలయాన్ని గురువారం సందర్శించిన ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సాయిబాబా ఆలయంలో భక్తుల సౌకర్యార్థం నిర్మిస్తున్న శౌచాలయాలను స్థానిక బీఆర్ఎస్ నాయకులు అడ్డుకుంటున్నారని కాలనీవాసులు శ్రీశైలంగౌడ్ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ఆయన శౌచాలయ పనులను పరిశీలించారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆలయాల అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజలే మీకు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఆలయాలకు గులాబీ రంగులు వేసి కబ్జా చేయాలని బీఆర్ఎస్ నేతలు చూస్తున్నారని ఆరోపించారు. పార్టీలకతీతంగా ఆలయాలు అభివృద్ధి జరగాలన్నారు. కానీ ఆలయ కమిటీల్లో కూడా బీఆర్ఎస్ పార్టీ నాయకులు జోక్యం చేసుకోవడం విడ్డురంగా ఉందన్నారు. కాలనీ సెక్రటరీ నాగరాజు, జాయింట్ సెక్రటరీ పద్మ, సభ్యులు కేఆర్‌కే రాజు, సంతోష్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, జిల్లా కార్యాలయం ఇన్‌చార్జ్ శివాజీ రాజు, రూరల్ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి సతీష్, సెన్సార్ బోర్డు సభ్యురాలు సరిత, నాయకులు శంకర్ నాయక్, అశోక్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



ఆలయం బయట చేపట్టిన శౌచాలయ నిర్మాణ పనులను పరిశీలిస్తూ..



సాయిబాబా ఆలయ పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్